సాక్షి
తిరుపతి

ఆదివారం । 21 । మే । 2023



వైభవంగా నైనాతమ్మ తిరునాల

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామ దేవత నైనాతమ్మ తిరునాళ్లను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు.



పూర్వవైభవం తీసుకొస్తా

వెంకటగిరి ఐఐహెచ్‌టీకి పూర్వవైభవం తీసుకొస్తానని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

-8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	27
చిత్తూరు	39	26
తిరుమల	36	23
గూడూరు	41	29
నగరి	41	28

న్యూస్‌రీల్

పాలిసెట్‌లో 87.32 శాతం మంది ఉత్తీర్ణత

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు పదో తరగతి విద్యార్హతతో ఈ నెల పదో తేదీన జరిగిన పాలిసెట్–2023 ప్రవేశ పరీక్షలో తిరుపతి జిల్లా నుంచి 87.32 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షకు జిల్లా నుంచి మొత్తం 4,470మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో బాలురు 2,460 మంది, బాలికలు 1,443మంది, మొత్తం 3,908 (87.32 శాతం)మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ వై.ద్వారకనాథ్ రెడ్డి తెలిపారు.

జిల్లా టాపర్లు వీరే

పాలసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. ఈ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో తిరుపతికి చెందిన ఏ.చరితశ్రీ 25వ ర్యాంకు, నారాయణవనానికి చెందిన ఆర్.మోహన్‌గోపి 156, గూడూరుకు చెందిన ఓ.చంద్రవదన్ 259వ ర్యాంకు సాధించి జిల్లా స్థాయిలో టాప్ 3 ర్యాంకులను సాధించారు.

ఇంటర్‌లో ప్రతిభావంతులకు ఉద్యోగాలు



మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్‌లో 75 శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు హెచ్‌సీఎల్‌లో ఉద్యోగాలతోపాటు ఉన్నత చదువులకు అవకాశం ఉందని చెప్పారు. 8వ తరగతి నుంచి ఐటీఐ వరకు చదివిన నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎస్ఎస్‌డీసీ–స్కిల్ హబ్ యాప్‌ను ఏర్పాటు చేసిందని, దీనిద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు సాంకేతిక శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులు సాధించి.. ఉన్నత చదువుల కోసం ఆర్థిక స్థోమత లేని వారికి ఉద్యోగంతో పాటు డిగ్రీ, బిట్స్ పిలానీ, శస్త్ర, అమిటీ, ఐఎంఎం నాగపూర్, కేఎల్ యూనివర్సిటీ తదితర చోట్ల చదువుకునే అవకాశం కల్పిస్తారన్నారు. నిరుద్యోగులు వలంటీర్లతోపాటు సచివాలయ ఉద్యోగులను సంప్రదించాలని సూచించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా!

'అండగా ఉంటాం.. ఎవ్వరూ అధైర్యపడొద్దు.. ఇప్పటికే మంటలు జరిగిన ఇళ్లల్లో వేలి ముద్ర నిపుణులు వాటి నమూనాలు సేకరించారు.. అతి త్వరలో ఆ రిపోర్టులు వస్తాయి.. అప్పుడు కారణాలు ఏమిటన్నది తేలుస్తుంది. తర్వాత ఏం చేయాలన్నదానిపై ఆలోచిద్దాం.. అప్పటి వరకు ఎవ్వరూ ఎక్కడికీ వెళ్లొద్దు.. గ్రామంలో నిరంతరాయంగా పోలీసుల పహారా కొనసాగుతుంది..అని' చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం చంద్రగిరి మండలం, కొత్త శానంబట్లలో కలెక్టర్, అడిషనల్ ఎస్పీ, ఆర్డీఓ, చంద్రగిరి డీఎస్పీతో కలిసి ఆయన పర్యటించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి మంటలపై ఆరాతీశారు.

- మంటల మిస్టరీని త్వరలోనే తేలుస్తాం
- గ్రామంలో నిరంతరాయంగా పోలీసు పహారా
- ఎవరూ భయపడి ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేదు
- గ్రామంలో ప్రతిసమస్యా పరిష్కరించే బాధ్యత నాదే
- శానంబట్ల గ్రామస్తులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, ఏఎస్పీ



శానంబట్లలో బాధిత మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): మంటల మిస్టరీని ఛేదిస్తాం.. అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మండలంలోని కొత్త శానంబట్ల గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. శనివారం మంటలు చెలరేగిన ఇళ్లను పరిశీలించిన ఆయన ఇంట్లో జరిగిన ప్రమాదం గురించి కుటుంబీకులను అడగి తెలుసుకున్నారు. ఎలాంటి సందర్భాల్లో మంటలు వ్యాపిస్తున్నాయి, బట్టలకు మాత్రమే ఎక్కువ సందర్భాల్లో మంటలు రావడానికి కారణాలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డి మాట్లాడుతూ వారం రోజులుగా గ్రామంలో అక్కడక్కడా మంటలు చెలరేగుతున్న వాటిపై ఇప్పటికే నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామని, రెండు రోజుల్లో నివేదిక వస్తుందన్నారు. మానవ తప్పిదమో, ఆచార సంప్రదాయాల వల్ల జరిగిందా తెలుస్తుందని, రిపోర్టు రాగానే తక్షణ సహాయ చర్యలు చెప్పడానికే కలెక్టర్‌ని తీసుకు వచ్చానన్నారు. పగలే మంటలు చెలరేగుతున్నాయని గ్రామస్తులు చెప్పడంతో భయాందోళన లేకుండా కుటుంబ సభ్యులకు అండగా గ్రామంలో మహిళా పోలీసులు 18 మందిని ఉంచుతామని తెలిపారు. ఇప్పటికే మంటలు చెలరేగిన ఇళ్ల వద్ద పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. అపోహలు, వదంతులు నమ్మొద్దని త్వరలో కారణాలు తెలుస్తాయని, మరో గ్రామంలో ఇలా జరగకుండా జాగ్రత్త పాడుదామని చెప్పారు.

అధికారులతో ప్రత్యేక సమావేశం

శానంబట్ల గ్రామంలో జరిగిన మంటల మిస్టరీ ఛేదించకుంటే ఇలాంటి పరిస్థితి మరో గ్రామానికి పాకుతుందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి సమక్షంలో పోలీసు అధికారులను హెచ్చరించారు. ఇప్పటి వరకు గ్రామంలో తీసుకున్న భద్రతా చర్యలు, పరిశీలించిన ప్రదేశాలు, విచారించిన సంఘటనలను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ వివరించారు. గ్రామంలో ఎవ్వరికీ భయం లేకుండా మంటల వెనుక దాగిన మిస్టరీని బయటపెట్టేంత వరకు తమ సిబ్బంది రాత్రి, పగలు పహారా కాసేందుకు చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. గ్రామంలో 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వివరించారు.

గ్రామంలో పశువుల ఆస్పత్రి

శానంబట్ల పంచాయతీ అభివృద్ధికి రూ.3.38 కోట్లు మంజూరు చేశామని, రోడ్లు, డ్రైనేజ్, కమ్యూనిటీ హాలు, పశువైద్యశాల, ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు టెండర్లు కూడా పిలుస్తామని ఎమ్మెల్యే చెవిరెడ్డి చెప్పారు. గ్రామంలో పశువుల ఆస్పత్రి ఏర్పటు కోసం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వివరాలు సేకరించినట్టు వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపించానన్నారు.

మిస్టరీ మంటలతో ఆందోళన



మంటల వల్ల కాలిన బీరువాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, అధికారులు

ఇంట్లో హఠాత్తుగా మంటలు రావడం.. బట్టలు కాలిపోవడం.. ఆ వెంటనే మంటలను అదుపు చేయడం ఇలా పది రోజులుగా శానంబట్ల గ్రామస్తులు అనుక్షణం హైరానా పడుతూ ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో పరిస్థితిని తెలుసుకుని బాధితులతో చర్చించేందుకు వచ్చిన ఎమ్మెల్యే చెవిరెడ్డి ముందు మహిళలు కంటతడి పెట్టుకున్నారు. గ్రామంలో ఉండాలంటే భయంగా ఉందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఊరు ఖాళీ చేసి పిల్లలతో సహా పుట్టింటికి వెళతామని చెప్పడంతో భయపడొద్దని ధైర్యం చెప్పారు. గ్రామంలో ఏం జరుగుతుందో రెండు, మూడు రోజుల్లో బయటకు వస్తుందని, అప్పటి వరకు ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.

గ్రామదేవత దయచూపలేదు.. నువ్వే అండగా నిలవాలి

'మా గ్రామదేవత దయచూపలేదు. నువ్వే అండగా నిలవాలి' అని స్థానికులు ఎమ్మెల్యే చెవిరెడ్డి వేడుకున్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తనకు ఎంతో ఇష్టమైన శానంబట్ల గ్రామంలో ఎవ్వరికి ఏం జరిగినా అండగా ఉంటానన్నారు. ఎక్కువ మంది రైతులు నివసించే గ్రామంలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. అంతకు ముందు గ్రామంలో మంటల వల్ల నష్టపోయిన బాధితులు అరుణ, రాణి, గోపీకృష్ణ గృహాలను సందర్శించారు. పర్యటనలో ఆర్డీఓ కనకనరసారెడ్డి, తహసీల్దార్ శిరీషా, పర్యావరణ ప్రొఫెసర్ దామోదర్, అగ్నిమాపక అధికారి రమణయ్య, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై శిక్షణ

తిరుపతి అర్బన్: ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చని డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని తన కార్యాలయంలో శనివారం ప్రత్యేక నిపుణుడు జీవీ రావు నేతృత్వంలో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డీపీటీవో మాట్లాడుతూ ముఖ్యంగా డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు.

చంద్రగిరి ఐపీఎల్‌లో అదే ఉత్సాహం



క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందిస్తున్న టోర్నమెంట్ కార్యనిర్వాహక చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



క్రీడాకారులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి

- చంద్రగిరి ఐపీఎల్ టోర్నీలో కొనసాగుతున్న పరుగుల ప్రవాహం
- మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతుల ప్రదానం
- క్రీడాకారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి ఐపీఎల్ కుర్రకారును హోరెత్తిస్తోంది. పల్లె క్రీడాకారులు పరుగుల ప్రవాహం కొనసాగిస్తున్నారు. బ్యాటర్లతో పాటు బౌలర్లు సైతం వికెట్లను చుట్టేస్తున్నారు. సోమవారంతో మొదటి దశ లీగ్ పోటీలు ముగియనున్నాయి. శనివారం 13 మైదానల్లో జరిగిన 52 మ్యాచ్‌ల్లో అత్యధికశాతం బౌలర్ల హవా కొనసాగింది. టోర్నమెంట్ కార్యనిర్వాహక చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మైదానంలో కలియతిరుగుతూ క్రీడాకారులను, నిర్వాహకులను ఉత్సాహ పరిచారు.

అద్భుతమైన అంపైరింగ్

పేరుకు గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ అయినా ఎక్కడా ఇబ్బందులు ఎదురుకాకుండా నిర్వాహకులు ప్రతిష్ట చర్యలు తీసుకున్నారు. పారదర్శకమైన అంపైరింగ్‌తో క్రీడాకారుల మన్ననలను పొందుతున్నారు. బీసీసీఐ నిర్వహించిన అంపైరింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 45 మంది ఇక్కడ అంపైరింగ్ విధుల్లో ఉండడం విశేషం. టోర్నమెంట్‌లో అంపైర్లదే తుది నిర్ణయం కావడంతో ఎక్కడా కూడా క్రీడాకారులు అసౌకర్యానికి గురికావడంలేదు.

ఒక్కో మైదానం నుంచి నాలుగు మ్యాచ్‌లు

శనివారం జరిగిన పోటీల్లో 13 గ్రౌండ్లలో 52 మ్యాచ్‌లను నిర్వహించారు. ఉదయం 8, 11, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 3 గంటలకు మ్యాచ్‌లను ప్రారంభించారు. ఒక్కో గ్రౌండ్ నుంచి నాలుగు మ్యాచ్‌ల చొప్పున 13 గ్రౌండ్లలో 52 మ్యాచ్‌లను నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ ఆల్ రౌండర్‌ను ఎంపిక చేసి వారికి ప్రత్యేక బహుమతులు అందించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్క క్రీడాకారున్ని ప్రోత్సాహించేలా పార్టిసిపేట్ మెడల్, ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

ప్రతి క్షణం పర్యవేక్షణ

వైఎస్ఆర్ క్రీడా మైదానంలో ప్రారంభమైన మ్యాచ్‌లను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రతి క్షణం పర్యవేక్షించారు. చాలా మంది క్రీడాకారులు ఎమ్మెల్యే చెవిరెడ్డితో సెల్ఫీలు దిగారు. అలాగే చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేతులు మీదగా క్రికెట్ కిట్లు తీసుకున్న క్రీడాకారులు ఆనందంతో మోహిత్ రెడ్డికి జేజేలు పలికారు. మ్యాచ్‌ల ప్రారంభ సమయంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి క్రీడాకారులకు టీ షర్ట్‌లను పంపిణీ చేశారు.

11 బంతుల్లో 7 వికెట్లు



7 వికెట్లు తీసిన శేషాద్రి

ఎర్రావారిపాళెం మండలం, యల్లమందకు చెందిన గొల్లపల్లి ఎవంజర్స్ జట్టు, కోటకాడపల్లి వైఎస్ఆర్ ఎస్టీ కాలనీ జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో యల్లమందకు చెందిన శేషాద్రి 11 బంతుల్లో 7 వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా ఎంపికయ్యాడు. అలాగే పాడిపేట బాయ్స్ జట్టు– మంగళంకు చెందిన ఎస్వీ చార్జర్స్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో మంగళంకు చెందిన మణి 15 బంతుల్లో 5 వికెట్లు తీశాడు. పాకాల మండలం కె.వడ్డేపల్లి, పళ్లివేడు జట్ల మధ్య జరిగిన పోటీల్లో వడ్డేపల్లికి చెందిన సుమంత్ 22 బంతుల్లో 95 పరుగులు సాధించి అజేయంగా నిలిచాడు.

26 నుంచి ఎస్వీ సంగీత కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్: ప్రకాశం రోడ్డులోని ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వర పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 26 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల నిర్వాహకులు తెలిపారు. గాత్రం, వీణ, వేణువు, వయోలిన్, నాదస్వరం, డోలు, భరతనాట్యం, కూచిపూడి, నృత్యం, హరికథ, మృదంగం, ఘటం విభాగాల్లో ఫుల్ టైమ్, విశారద (డిప్లొమా), ప్రవీణ (అడ్వాన్స్ డిప్లొమా) కోర్సులు ఉన్నాయని, ఎస్వీ నాదస్వరం, డోలు, పాఠశాలలో ఫుల్ టైమ్ సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు ఉన్నాయని తెలిపారు. జూన్ 21 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ సవతి ఉందని వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు కళాశాల కార్యాలయ పనివేళల్లో రూ.50లు చెల్లించి దరఖాస్తు పొందవచ్చు. రెగ్యులర్ కోర్సులకు 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. సాయంత్రం కోర్సులకు 5వ తరగతి ఉత్తీర్ణత పొందిన వారు అర్హులు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయం పనివేళ్లలో లేదా, 0877–2264597ను సంప్రదించాలని కోరారు.

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి



ఆలయం వెలుపల జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

తిరుచానూరు(చంద్రగిరి): హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్ శనివారం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి, తర్వాత సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించి, అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు.

పకడ్బందీగా సప్లిమెంటరీ పరీక్షలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని 122 పరీక్షా కేంద్రాల్లో ఈ నెల 24నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐఓ రమేష్ ఆదేశించారు. తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాలలో సీఎస్‌లు, డీఓలు, కస్టోడియన్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలుంటాయన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం



ఏర్పేడు: మండలంలోని మేర్లపాక–కొత్త కండ్రిగ గ్రామాలకు సమీపంలో శనివారం రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి(25) మృతదేహం లభ్యమైనట్లు శ్రీకాళహస్తి రైల్వే పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం 9.10 గంటలకు తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్లే రైలు కిందపడి మృతి చెందినట్లు వివరించారు. రైలు నుంచి కాలు జారిపడ్డాడా.. లేక రైలు ఢీకొని మృతి చెందాడా విచారణలో తేలుతుందన్నారు. మృతుడు చామన ఛాయ రంగు, తెల్లని బన్నియన్, సిమెంట్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతుని కుడి చేతికి అమ్మ అనే పచ్చబొట్టు, కడియం ధరించి ఉన్నాడన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేద విజ్ఞానాన్ని భావితరాలకు అందించాలి

- టీటీడీ ఈఓ ధర్మారెడ్డి పిలుపు
- వేదిక్ హెరిటేజ్ కారిడార్ ప్రారంభం



హెరిటేజ్ కారిడార్‌లోని చిత్రాలను పరిశీలిస్తున్న ఈఓ



వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి రచించిన రెండు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఈఓ, జేఈఓ

తిరుపతి ఎడ్యుకేషన్ : వేదాల్లోని విజ్ఞానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన వేదిక్ హెరిటేజ్ కారిడార్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. కొన్ని వేల సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు రచించిన వేదాల్లో నేటి ఆధునిక సాంకేతిక అంతరిక్ష విజ్ఞానం, యాజమాన్య నిర్వహణ, గణితం, ఆరోగ్య సంరక్షణ, యోగా వంటి 190 అంశాలను కూలంకషంగా అప్పట్లోనే వివరించారన్నారు. వీటి గురించి నేటి తరం వారికి తెలియజేసే ప్రయత్నం చేయడం సంతోషకరమన్నారు. అనంతరం వేద విజ్ఞానానికి సంబంధించి పలు అంశాలతో వేద విశ్వవిద్యాలయం వీసీసి ఆచార్య రాణి సదాశివ మూర్తి రచించిన సం ఫ్యాక్ట్స్ ఆఫ్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్, ఎస్సెన్స్ ఆన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ అనే రెండు పుస్తకాలను ఈఓ ఆవిష్కరించారు. వర్సిటీ వీసీ మాట్లాడుతూ వేదాలు, యజ్ఞ యాగాలు నిర్వహించడం, గృహాలలో సంస్కారాలు చేసుకోవడానికి మాత్రమే పనికి వస్తాయనే అపోహ నేటి తరానికి ఉందన్నారు. ఆధునిక జీవన విధానంలో వేద విజ్ఞానం ఏవిధంగా ఉపయోగపడుతుందో తెలిపేందుకు వేదిక్ హెరిటేజ్ కారిడార్‌ను ఏర్పాటుచేశామని, నిర్ణీత సమయంలో ఈ చిత్ర ప్రదర్శనను సందర్శించి అనేక విషయాలను తెలుసుకోవచ్చని తెలిపారు. అనంతరం మ్యాన్ స్క్రిప్ట్స్ ప్రాజెక్ట్ మాస ప్రగతిపై ఈఓ సమీక్షించారు. టీటీడీ జేఈఓ సదాభార్గవి, సనాతన జీవన ట్రస్ట్ అధ్యక్షులు శశిధర్, మ్యాన్ స్క్రిప్ట్స్ ప్రాజెక్ట్ డెప్యూటీ ఈఓ విజయలక్ష్మి, వేదిక్ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యాంలు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతి

చిట్టమూరు: నాయుడుపేట మండలం, మిట్టకండ్రిగ గ్రామ సమీపంలో శుక్రవారం తెలుగుగంగ కాలువలో గల్లంతైన వ్యక్తి శనివారం చిట్టమూరు మండలం, యాకసిరి అటవీ ప్రాంతంలోని తెలుగుగంగ కాలువలో శవమై తేలినట్లు అర్బన్ సీఐ నరశింహారావు తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని లోతువాని గుంట ప్రాంతానికి చెందిన శెట్టి రాజా (33) ఆటో మెకానిక్‌గా పనిచేస్తున్నాడని, స్నేహితులతో కలిసి శుక్రవారం మిట్టకండ్రిగ గ్రామ సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువలో ఈత కొట్టేందుకు దిగి గల్లంతైనట్లు వెల్లడించారు. నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ బస్సులకు డ్రైవర్లు కావలెను

తిరుపతి తుడా: తిరుపతి అలిపిరి డిపో పరిధిలో నడిపే ఏపీఎస్ఆర్టీసీ విద్యుత్ ఏసీ బస్సుల్లో ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టులకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సల్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ భాస్కరరావు తెలిపారు. హెవీ లైసెన్స్ కలిగి, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై, వయస్సు 58 సంవత్సరాలు మించని వారు అర్హులన్నారు. ఆర్టీఏ క్లియరెన్స్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డ్, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, జిరాక్స్ కాపీలతో సంప్రదించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8341027109, 9182576787 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఈతకెళ్లి బీటెక్ విద్యార్థి మృతి



మనీష్ (ఫైల్)

చంద్రగిరి(తిరుపతి రూరల్): కళ్యాణిడ్యామ్‌లో ఈతకెళ్లి శనివారం ఓ విద్యార్థి మృతి చెందాడు. మృతిచెందిన విద్యార్థి ప్రకాశం జిల్లాకు చెందిన మనీష్ (18)గా పోలీసులు గుర్తించారు. ప్రకాశం జిల్లా, పామూరు మండలం, చింతలపాలెంకు చెందిన జయప్రకాష్, సరళకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పరశురామును బీటెక్ చదివించారు. అలాగే చిన్న కుమారుడు మనీష్‌ను చంద్రగిరి మండలంలో బీటెక్‌లో చేర్పించారు. శనివారం రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యాంలో ఈతకొట్టేందుకు బీటెక్ చదువుతున్న ఐదుగురు విద్యార్థులు వెళ్లగా.. మనీష్ మునిగిపోయాడు. చుట్టుపక్కల వారు అతన్ని కాపాడే ప్రయత్నం చేశారు. 108 ద్వారా తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకురాగా విద్యార్థి అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మృతదేహం వెలికితీత

కోట: విద్యానగర్ పోస్టాఫీస్ వీధిలో నేలబావిలో పడి మృతి చెందిన తులసమ్మ(60) మృతదేహాన్ని శనివారం గజ ఈతగాళ్ల సాయంతో వెలికితీసినట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు. శుక్రవారం చీకటిపడడంతో 40 అడుగుల బావిలోని మృతదేహాన్ని తీసేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. తులసమ్మ భర్త సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,680
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,629

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77.00

బర్రె వైద్యఖర్చులు ఇవ్వలేదని హత్య

- రూ.10వేల కోసం ప్రాణం తీసిన కిరాతకులు



నిందితులతో డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

పిచ్చాటూరు: బర్రెకు చేసిన వైద్యఖర్చులు ఇవ్వలేదన్న నెపంతో ఓ వ్యక్తిని అతికిరాతకంగా నరికి చంపారు. ఈ మేరకు శనివారం నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ నాగలాపురం మండలం, కాళంజేరి గ్రామానికి చెందిన మునస్వామి దగ్గర మూడు నెలల క్రితం తమిళనాడులోని మేలకొండయార్ గ్రామానికి చెందిన బాలసుబ్రమణ్యం, శివన్‌వాయల్ గ్రామానికి చెందిన మణికంఠన్ 7 బర్రెలు, 7 దూడలను రూ.1.20 లక్షలకు కొనుగోలు చేశారు. ఇందులో ఒక బర్రె అనారోగ్యానికి గురికావడంతో వ్యాధిని నయం చేయడానికి రూ.10 వేలు ఖర్చు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో ఈనెల 13న రాత్రి 8 గంటలకు ఆ బర్రె, దాని దూడను కాళంజేరిలోని మునస్వామికి అప్పగించారు. దీనికి బదులుగా బాగున్న బర్రె, దూడను ఇవ్వాలని, లేకుంటే తాము ఇచ్చిన డబ్బులు, పశువులకు చేసిన ఖర్చు రూ.10 వేలు మొత్తం రూ.1.30 లక్షలు ఇవ్వాలని భీష్మించుకున్నారు. నిందితులు అప్పటికే మునస్వామికి రూ.30 వేలు బాకీ ఉండడంతో అది పోను రూ.లక్ష ఇవ్వాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారు. మునస్వామి తండ్రి జోక్యం చేసుకొని రూ.90 వేలు తిరిగి ఇచ్చేస్తామని సర్దిచెప్పాడు.

రూ.10 వేల కోసం హత్య

గడువు మేరకు ఈనెల 18న బాలసుబ్రమణ్యం (29), మణికంఠన్(25) మునస్వామి ఇంటికి రావడంతో అదే రోజు రూ.90 వేలు నగదును ఇచ్చాడు. బర్రెకు చేసిన వైద్యఖర్చు రూ.10 వేలు ఇవ్వలేనని చెప్పాడు. దీంతో నిందితులు మునస్వామిని వెంటబెట్టుకుని నాగలాపురంలోని బాలుశెట్టిషెడ్డు వద్ద మద్యం సేవించి, తాము తెచ్చుకున్న కత్తితో మునస్వామిని హతమార్చి పారిపోయారు.

ఐఐహెచ్‌టీకి పూర్వవైభవం తీసుకొస్తా

వెంకటగిరి: వెంకటగిరి ఐఐహెచ్‌టీకి పూర్వవైభవం తీసుకువస్తానని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆ సంస్థలో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీని దివంగత సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఏర్పాటు చేయించారని, అటువంటి సంస్థను మరింత అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే రూ.35 లక్షలు మంజూరు చేయించానన్నారు. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తన సొంత నిధులు మరో రూ.25 లక్షలతో మూడ్‌షెడ్ పైకప్పులు పునఃనిర్మించనున్నట్లు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఐఐహెచ్‌టీలో ఇప్పటికే టెన్త్ ఉత్తీర్ణతతో 66 సీట్లు డిప్లొమోకోర్సుకు అందుబాటులో ఉండగా, ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారికి లెటరల్ ఎంట్రీద్వారా 6 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైందన్నారు.